సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 31 । మార్చి । 2023



ధాన్య సిరికి కొనుగోలు భరోసా
రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు ఇప్పటివరకు జిల్లాలో 124 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8లో




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,340
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రాము)	రూ.5,479
3 శాతం జీఎస్టీతో	రూ.5,643
నవర (8 గ్రా)	రూ.45,144

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.8 /25.7

గురువారం గాలిలో 69 శాతం తేమ ఉంది. శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశముంది.





మంగళసూత్రాన్ని చూపుతున్న వేదపండితుడు



కళ్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా
నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా జరుగుతుందని ఉపాధి అధికారి ఎ.సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లలిత జ్యువెలరీ, శ్రీరామ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం 25 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆటోనగర్ లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు నేటితో గడువు పూర్తి



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను బకాయిలున్న యజమానులు వడ్డీ లేకుండా ఏకకాలంలో నగదు చెల్లించేందుకు గడువు శుక్రవారంతో ముగుస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగదు కట్టేందుకు ఈనెల 16 నుంచి 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందన్నారు. అనేకమంది గృహ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలియజేశారు. శుక్రవారంతో గడువు ముగుస్తున్నందున మిగిలిన యజమానులు నగదు చెల్లించాలని ఆమె కోరారు.

ముగిసిన ఫ్లోర్ కర్లింగ్ పోటీలు



ట్రోఫీ, మెడల్స్ అందుకున్న క్రీడాకారులు

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న ఎల్ఎల్ఎఫ్ స్కూల్లో రాష్ట్రస్థాయి కర్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్లోర్ కర్లింగ్ గేమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి, ద్వితీయ స్థానాన్ని నెల్లూరు, తృతీయ స్థానాన్ని కర్నూలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారన్నారు. వీరు మే 19 నుంచి 21వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలతోపాటు ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, సెక్రటరీ మనోహర్, వైఎస్సార్‌సీపీ 28వ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
సోమశిల: అనంతసాగరం మండలంలోని కమ్మవారిపల్లిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. సోమశిల ఎస్సై భోజ్యానాయక్ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన సింహాచలంనాయక్ (45) కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో గోతాలను పట్టలుగా కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య సామ్రాజ్యం, ఇద్దరు కుమారులున్నారు. కాగా గురువారం ఉదయం ట్రాక్టర్ హ్యాండిల్‌కు అతను వేలాడుతూ కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చూసిన కనులదే భాగ్యం

- వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం
- రామయ్య నామస్మరణతో పులకించిన శ్రీరామకోటి స్తూప ప్రాంగణం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం దగ్గర టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న శ్రీరామకోటి స్తూప ప్రాంగణంలో వేదమంత్రోచ్చారణలు.. మంగళవాయిద్యాలు, జై శ్రీరాం నామస్మరణ నడుమ సీతాదేవికి, కోదండరాముడికి కనుల పండువగా కల్యాణం జరిగింది. సీతాదేవి, కోదండరాముడు విశేషాలంకారంలో శబరి శ్రీరామక్షేత్రం నుంచి కల్యాణ వేదికైన శ్రీరామకోటి స్తూప ప్రాంగణానికి మేళతాళాల నడుమ తరలివచ్చారు. సంప్రదాయంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజిత దంపతులు పట్టువస్త్రాలను, కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు, కిరణ్మయి దంపతులు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వేదపండితులు పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవ వ్యాఖ్యాతలుగా తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఆకెళ్ల విభీషణశర్మ, సాయినాథాచార్యులు వ్యవహరించారు. ఆధ్యాత్మిక చింతన, సామాజిక బాధ్యతలను సీతారాముల దాంపత్య జీవితంతో సమన్వయపరుస్తూ వివరించారు. కల్యాణ ఉభయకర్తలుగా పిడూరు కిశోర్‌రెడ్డి – శరణ్య, పిడూరు భానుప్రకాష్‌రెడ్డి – నాగమణి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను శబరి శ్రీరామక్షేత్రం భక్తబృందం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పానకం, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు, గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- కల్యాణోత్సవం అనంతరం స్వామికి సమర్పించిన ముత్యాల తలంబ్రాలు, తలంబ్రాల బియ్యం (అక్షతలు), అన్నప్రసాదాన్ని టీటీడీ కల్యాణ మండపంలో వేలాదిమంది భక్తులకు వితరణ చేశారు.
- శ్రీరామచంద్రుడిని స్మరిస్తూ భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ప్రాంగణంలోని స్తూపంలో గురువారం సాయంత్రం నిక్షిప్తం చేశారు.

మానవాళికి ఆదర్శప్రాయం: కాకాణి

మహోన్నత వ్యక్తిత్వం కలిగిన శ్రీరామచంద్రుడి జీవితం సకల మానవాళికి ఆదర్శప్రాయమని మంత్రి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి శబరి శ్రీరామక్షేత్రం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలను జయప్రదంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ధర్మరక్షణ కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా దీటుగా ఎదుర్కోవాలనే శ్రీరాముడి జీవితం ప్రస్తుత సమాజానికి మార్గదర్శకమన్నారు. జీవితంలో ఆచరించాల్సిన, సాధించాల్సిన వాటిని స్వయంగా ఆచరించి చూపిన పురుషోత్తముడు శ్రీరామచంద్రుడన్నారు.

పిల్లలకు వివరించాలి: కలెక్టర్

కుమారుడిగా, అన్నగా, భర్తగా, తండ్రిగా కుటుంబంలో అన్ని బంధాలకు ఆదర్శంగా నిలిచిన శ్రీరామచంద్రుడు సకల గుణాభి రాముడని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అన్నారు. ఉత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనిషిలోని బలాలు, బలహీనతలతోసహా అన్ని విషయాలను స్పృశించిన అద్భుత మహాకావ్యం రామాయణమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు రామాయణం గురించి వివరించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకెళ్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు



తలంబ్రాలు, కల్యాణోత్సవ సామగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: పల్లెల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కోడూరు బిట్–1 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం సాయంత్రం మంత్రి కాకాణి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి కాకాణి పాముదొరువుకండ్రిగలో నూతనంగా నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మండలాధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రారంభించిందన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల అవసరాలను తీర్చేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లను నిర్మించడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా నడుస్తున్నానన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఆనందంగా రైతులు

ఈ రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మంచి ధరలు వస్తుంటే ప్రతిపక్ష టీడీపీ జీర్ణించుకోలేకపోతోందని మంత్రి కాకాణి అన్నారు. ధాన్యం ధరలు పతనమై రైతులు తిరుగుబాటు చేస్తే అవకాశంగా తీసుకుని అధికార పార్టీపై బురద జల్లాలని టీడీపీ ఆరాటపడుతోందన్నారు. కానీ ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో సాగునీరందడం, పంటలు పుష్కలంగా పండడం, ధాన్యానికి మంచి ధర వస్తుండడంతో రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ మాత్రం అయోమయంలో పడిపోయిందన్నారు. కావలిరెడ్డి సోదరుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఇసనాక రమేష్‌రెడ్డి, కోడూరు దిలీప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు కావలిరెడ్డి రవీంద్రారెడ్డి, కావలిరెడ్డి రంగారెడ్డి, కావలిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, కావలిరెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, కావల్‌రెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ కంజి నీలమ్మ, సర్పంచ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడు లారీతో డ్రైవర్ పరార్

బుచ్చిరెడ్డిపాళెం: ధాన్యం లోడు లారీతో డ్రైవర్ పరారైన ఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెనికి చెందిన శంకర్ వరప్రసాద్ అనే వ్యక్తి లారీల సప్లైతోపాటు ధాన్యం బ్రోకర్‌గా పని చేస్తున్నాడు. తన వద్ద ఉన్న ధాన్యం లోడు లారీకి డ్రైవర్ లేకపోవడంతో స్నేహితుడైన కృష్ణయ్యకు ఫోన్ చేశాడు. డ్రైవర్ కావాలని కోరాడు. దీంతో కృష్ణయ్య ఓ డ్రైవర్‌ను శంకర్‌వరప్రసాద్ వద్దకు పంపాడు. ఈనెల 24వ తేదీన అతడికి వరప్రసాద్ ధాన్యం లోడు లారీని అప్పగించి, అడ్వాన్స్ కింద రూ.22 వేలు ఇచ్చాడు. ధాన్యాన్ని మండపేట వద్ద దించాలన్నాడు. అయితే 29వ తేదీ వరకు కూడా లారీ రాకపోవడంతో మండపేటలో ధాన్యం కొనుగోలు చేసిన వ్యక్తులు ఫోన్ చేసి శంకర్ వరప్రసాద్‌కు తెలిపారు. దీంతో డ్రైవర్ తమను మోసం చేసి పరారైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా లారీ గుంటూరు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

- గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమవర్మ
- జిల్లా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నెల్లూరు సిటీ: గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన జిల్లా పోలీస్, ఎస్ఈబీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, పొరుగు మద్యం విక్రయాల కట్టడికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకుని సిబ్బందికి సూచనలిచ్చారు. పదే పదే నేరాలకు పాల్పడేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించాలన్నారు. సమావేశంలో ఎస్పీ విజయారావు, అడిషనల్ ఎస్పీలు హిమావతి, ప్రసాద్, సెబ్ అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

సోమశిలలో 54.770 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 54.770 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 357 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 1,200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.164 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 316 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.



సోమశిల జలాశయంలో నీటి నిల్వ (ఫైల్)

రెండో పంటకు ఇబ్బంది లేకుండా..

- సాగునీరిచ్చేందుకు అధికారుల చర్యలు
- నేడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం
- హాజరుకానున్న మంత్రి కాకాణి, ప్రజా ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో రెండో పంటకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని సోమశిల, కండలేరు రెండు జలాశయాల్లో ఉన్న నీటి లభ్యత ఆధారంగా రెండో పంటకు నీరందించేలా చర్యలు చేపట్టారు.

జిల్లాలోని ప్రధాన జలాశయమైన సోమశిలలో ప్రస్తుతం నీటి నిల్వ 54 టీఎంసీలు. కండలేరులో 41 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ, లైవ్ స్టోరేజీ, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల ఆయకట్టు పరిధిలో రెండో పంటకి నీటి కేటాయింపులు చేయనున్నారు.

- రైతుల పంటలకు, సంబంధిత ఆయకట్టుకు నీటిని అందించే సాగునీటి సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు నెల్లూరులోని నూతన జెడ్పీ సమావేశ మందిరంలో ఇరిగేషన్ ఎస్ఈ పి.కృష్ణమోహన్ అధ్యక్షతన నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, రైతు నాయకులు హాజరై నీటి కేటాయింపుల ప్రతిపాదనను ఆమోదించనున్నారు.

సోమశిల పరిధిలో..

ప్రస్తుతం సోమశిల జలాశయంలో ఉన్న నీటి నిల్వ ఆధారంగా తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటిని ప్రతిపాదించనున్నారు. ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉన్న పంటలకు 4.81 టీఎంసీలు, మిగిలిన 50.20 టీఎంసీల్లో డెడ్ స్టోరేజీ, నీటి ఆవిరి, నెల్లూరు కార్పొరేషన్‌కు, కావలి, అల్లూరు తదితర తాగునీటి అవసరాలకు పోనూ 32 టీఎంసీలుంటాయి. ఈ నీటిని, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో లభ్యమయ్యే 1.500 టీఎంసీలను రెండో పంటకు వివిధ కాలువల ద్వారా 2,85,000 ఎకరాలకు అందించేలా ప్రణాళికలు చేశారు.



కండలేరు జలాశయం (ఫైల్)

కండలేరు పరిధిలో..

కండలేరు జలాశయానికి సంబంధించి డెడ్ స్టోరేజీ, లైవ్ స్టోరేజీ, చెన్నై తాగునీటి అవసరాలు, రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, తిరుపతి తాగునీటి అవసరాలకు, స్వర్ణముఖి బ్యారేజీ నీటి అవసరాలకు, ఆవిరి శాతం, పరిశ్రమలకు 27.949 టీఎంసీల నీరు అవసరం కాగా మిగిలిన 14 టీఎంసీల నీటిని నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని 1.40 లక్షల ఎకరాలకు రెండో పంట కింద అందించనున్నారు.

నీటిని వృథా చేయొద్దు



రైతులు నీటిని వృథా చేయొద్దు, వరితోపాటు ఇతర పంటలు వేస్తే మంచిది. నాలుగేళ్లుగా రెండో పంటకు క్రమం తప్పకుండా నీరిస్తున్నాం. రెండు బ్యారేజీల నిర్మాణాలు, నీటి క్రమబద్ధీకరణ వల్ల రైతులకు ఎంతో లాభం. అధికారులు నిర్దేశించిన మేరకు పంటలను వేసుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలి.

– పి.కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

కాలువ	కేటాయింపులిలా.. అభివృద్ధి చెందిన ఆయకట్టు (ఎకరాల్లో)	రెండో పంటకు ప్రతిపాదించిన ఆయకట్టు	ప్రతిపాదించిన నీటి పరిమాణం టీఎంసీల్లో
పెన్నా డెల్టా	2,47,000	1,80,000	20.230
కనుపూరు కాలువ	66,000	30,000	3.3
కావలి కాలువ	1,24,000	30,000	3
జీకేఎన్ (ఎస్ఎస్ఎఫ్)	72,000	25,000	2.8
దక్షిణ కాలువ	24,000	20,000	2.2

నెల్లూరులోనే మైనింగ్ ఏడీ కార్యాలయం

నెల్లూరు(సెంట్రల్): మైనింగ్ ఏడీ కార్యాలయాన్ని తిరుపతి జిల్లాకు తరలించకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి జిల్లా గూడూరుకు ఏడీ కార్యాలయం తరలిస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు ఈనెల మొదట్లో ప్రకటించారు. అయితే తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కార్యాలయాన్ని నెల్లూరులోనే కొనసాగించాలని తెలియజేశారు.

ధాన్య సిరికి కొనుగోలు భరోసా

- రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా సన్నద్ధం
- ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందిస్తున్న వీపీఏలు


ధాన్యాన్ని బస్తాలకు కడుతున్న దృశ్యం (ఫైల్)

నెల్లూరు(సెంట్రల్) : ధాన్య సిరిగా పేరుగాంచిన సింహపురి జిల్లాలో ఈ ఏడాదిలో ధాన్యం కొనుగోలుకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా వ్యవసాయ శాఖ అన్నిరకాల చర్యలు తీసుకుంటోంది. గత అనుభవాలను, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ధాన్యం సేకరణ చేసే విధంగా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దిగుబడి ఆధారంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రానున్న రోజుల్లో మరికొన్ని చోట్ల ఏర్పాట్లకు పక్కాప్రణాళిక సిద్ధం చేశారు.

సమృద్ధిగా వర్షాలు.. ముమ్మరంగా సాగు

జిల్లాలో వ్యవసాయానికి సంబంధించి రబీ సీజన్‌లో ఎక్కువగా ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గత మూడు సంవత్సరాల నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో పాటు సాగునీరు పుష్కలంగా ఉండడంతో వరిసాగు ముమ్మరంగా జరుగుతోంది. ఈ ఏడాది కూడా సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండడంతో జిల్లాలో దాదాపుగా 4.50 లక్షల ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతో పాటు దిగుబడి ఆధారంగా రానున్న రోజుల్లో 175 వరకు కేంద్రాలు ఏర్పాటు చేసే యోజనలో అధికారులు కసరత్తు చేస్తున్నారు.

గతంతో పోల్చుకుంటే..

సాధారణంగా జిల్లాలో 6 లక్షల నుంచి 7 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. దానికి అనుగుణంగా రబీలో దాదాపుగా 12 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 14 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుంటుంది. కాగా గతంతో పోల్చుకుంటే సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గంలోని కొంత భాగం తిరుపతి జిల్లాలోకి వెళ్లిపోవడంతో జిల్లాలో సాగు కొంత తగ్గినట్లు అయింది. దీనివల్ల ఈ ఏడది రబీలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు జరిగినట్లు అధికారులు గుర్తించారు.

తేదీల ప్రకారం

జిల్లాలో పండించిన ధాన్యం ఆధారంగా ప్రస్తుతం ప్రభుత్వం 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనుంది. రైతుల నుంచి వచ్చే దాని ప్రకారం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేసి రైతులకు ధాన్యం సేకరణ వివరాలు కూడా అధికారులు తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాల్లోని వీపీఏలు రైతులకు ధాన్యం సేకరణ గురించి వివరాలు అందజేస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద వేచి ఉండకుండా ముందుగానే ఒక తేదీ ప్రకారం రైతులకు సమాచారం ఇచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కడా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేకుండా చేసేందు కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో..

ఇప్పటివరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు - 124
దిగుబడి ఆధారంగా - 175 వరకు పెంపు
సాగు అంచనా - 4.50 లక్షల ఎకరాల్లో
దిగుబడి అంచనా - 8.50 లక్షల మెట్రిక్ టన్నులు

రైతుల కోసం..



జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మొదటి విడతలో 124 కేంద్రాలు ఏర్పాటు చేశాం, ధాన్యం దిగుబడి ఆధారంగా మరికొన్ని కేంద్రాలను పెంచే యోచనలో ఉన్నాం. రైతులకు ముందుగానే కొనుగోలు తేదీ గురించి సమాచారం ఇవ్వడం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం.

– నర్సోజి, ఏడీ, వ్యవసాయశాఖ, నెల్లూరు

క్లుప్తంగా

హోరాహోరీగా ఎడ్ల పందేలు


పోటీలో తలపడుతున్న ఎడ్లు

కోవూరు : శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని నేతాజీనగర్‌లో గురువారం ఎడ్ల పందేలు హోరాహోరీగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 30 జతల ఎడ్లు పాల్గొనగా, డీసీఎంఎస్ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ పార్వతి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా కొనసాగుతున్న ఎడ్ల పందేలను జిల్లాలోని అనేక ప్రాంతాల్లో జరుగుతున్నట్లు తెలిపారు. హోరాహోరీగా జరిగిన పోటీల్లో మినగల్లు ఎడ్లు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో కోవూరు, గంగపట్నం ఎడ్లు నిలిచాయి. పోటీలు నిర్వహించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్, ఎంపీటీసీ సభ్యురాలు బాబురావు, సచివాలయాల మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 121
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 212
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ చికెన్	: 128

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


ప్రసాదాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

- వేడుకగా ధ్వజారోహణ
- దేవతలకు ఆహ్వానం పలుకుతూ పూజలు
- సంతానం లేని వారికి కొడిముద్దల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ధ్వజ స్తంభానికి కొడిగుడ్డను కట్టి బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. అనంతరం సంతానం లేని మహిళలకు కొడి ముద్దలను అందజేశారు. తదుపరి తిరుచ్చి ఉత్సవాన్ని ఆలయ ఆవరణలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతాసమేత కోదండరామస్వామిని విశేషంగా అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు.

మహావిష్ణువుగా కోదండరాముడు


బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కోదండరామస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు మహావిష్ణువు అలంకారంలో భక్తులను కటాక్షించారు. గ్రామోత్సవంలో భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో జెడ్పీ చైర్‌పర్సన్

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం దర్శించుకున్నారు. తొలుత గణపతి స్వామి, సుబ్రహ్మణ్యంస్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.


కామాక్షితాయి ఆలయంలో అరుణమ్మ తదితరులు

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.20

పడుతూ.. లేస్తూ

- పెరిగిన నిమ్మకాయల ఎగుమతులు
- తగ్గిన ధరలు


మార్కెట్‌లో కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు


లారీల్లో లోడ్ చేస్తున్న నిమ్మబస్తాలు

పొదలకూరు : కాలువలు, బోర్లలో పుష్కలంగా లభ్యమవుతున్న జలాలతో మెట్టప్రాంత రైతులు నిమ్మతోటలను కాపాడుకుంటూ దిగుబడులు పెంచుకుంటున్నారు. ఫలితంగా గతేడాదితో పోల్చిచూస్తే కాయల ధరల్లో వ్యత్యాసం కనపడుతోంది. మార్చి మొదటి వారంలో ఆశించిన దానికంటే ధరలు బాగా పెరిగి మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతంగా లూజు(బస్తా) ఒక్కటింటికి రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు ధర పలుకుతున్నాయి. కిలోల లెక్కన చూస్తే రూ.60 నుంచి రూ.65 మాత్రమే అమ్ముడుపోతున్నాయి. మార్చి మొదటి వారంలో బస్తాకాయలు రూ.7,500 వరకు ధర పలిగిన విషయం తెలిసిందే. పొదలకూరు, గూడూరు నిమ్మమార్కెట్ల నుంచే ప్రతినిత్యం 25 లారీల్లో కాయలు ఎగుమతి అవుతున్నాయి. అలాగే తెనాలి, ఏలూరు, రాజమండ్రి మార్కెట్ల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల్లోని చిన్నచిన్న మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి.

సుమారు 100 లారీల్లో..

ప్రస్తుతం నిమ్మకాయల ఎగుమతులు పెరిగాయి. ఏపీ, తెలంగాణ నుంచే కాకుండా బయటి రాష్ట్రాల నుంచి ప్రతినిత్యం సుమారు 100 లారీల్లో కాయలు ఎగుమతి అవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో కాయల ఎగుమతి విపరీతంగా పెరిగి వేసవిలోనూ ధరలు దిగజారుతున్నాయి. ఇవికాక తెలంగాణ రాష్ట్రం నకిరేకల్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం నిమ్మకాయల ఎగుమతి పెరిగినట్లు తెలుస్తోంది. ఉత్తర భారత దేశంలోని ఢిల్లీతో పాటు, లక్నో, వారణాసి, మధుర, గోరఖ్‌పూర్, అలహాబాద్ తదితర ప్రాంతాలకు కాయల ఎగుమతి చేస్తున్నారు. అయితే ఫ్యాక్టరీలకు కాయలు వెళ్లడం లేదు. కేవలం గృహ వినియోగానికి, శీతల పానియాలు సేవించేందుకు మాత్రమే నిమ్మకాయలను ప్రస్తుత వేసవి సీజన్లో వినియోగిస్తున్నారు.

శీతాకాలంలోనే పరిశ్రమల కొనుగోలు

ఊరగాయ పరిశ్రమలు, సబ్బులు, చాక్లెట్లు, ఇతర నిమ్మ ఆధారిత వస్తువుల తయారీ పరిశ్రమలు కాయలను శీతాకాలంలోనే కొనుగోలు చేస్తారు. శీతాకాలంలో నిమ్మ వినియోగం తక్కువగా ఉండడంతో పాటు ధరలు స్వల్పంగా ఉంటాయి. ఈ సమయంలో పరిశ్రమలు కాయలను కొనుగోలు చేసి నిమ్మ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకుంటాయి. వేసవిలో ఫ్యాక్టరీల యాజమాన్యాలు కాయలను కొనుగోలు చేస్తే ధరలు పెరిగే అవకాశం ఉంటుంది.

నేత్రపర్వం.. సాయినాథుడి నగరోత్సవం


వేడుకగా సాగుతున్న సాయినాథుని నగరోత్సవం


సాయినాథుని వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం) : సాయినామ సంకీర్తనలు, మంగళ వాయిద్యాలు, తీన్‌మార్ బ్యాండ్ మేళాలు, పండరి భజనలు, కోలాటాల నడుమ సాయినాథుడి దివ్యరథ నగరోత్సవం బాలాజీనగర్ శివారులోని పద్మావతినగర్‌లో గురువారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఉదయం 6 గంటలకు సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయిమాత నిత్యాన్నప్రసాద నిలయం, శ్రీసాయి సేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం సుమారు 8 వేల మందికి అన్నప్రసాదాలు అందించారు. సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం జరిగింది. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై సాయినాథుడి చిత్రపటాన్ని ప్రతిష్ఠించారు. పద్మావతినగర్, బాలాజీనగర్, ఏసీనగర్ తదితర ప్రాంతాల మీదుగా నగరోత్సవం సాగింది. కార్యక్రమాలను మందిరం గౌరవ సలహాదారు రామసుబ్బయ్య, శ్రీసాయి భక్తబృందం పర్యవేక్షించింది.